# ప్రభుత్వ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి..

## • ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ • బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కాచిగూడ,అక్టోబర్ 25: సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలే అంబర్‌పేటలో రెండోసారి తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ అంబర్‌పేటలో ప్రత్యర్థి ఏ పార్టీ వారైనా ప్రజల మద్దతుతో తాను బంపర్ మెజార్టీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అంబర్‌పేట అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నానని, రాజకీయాలకు అతీతంగా అందరితో మాట్లాడుతూ నిత్యం ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ అండగా ఉంటున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు 3,800 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను ఉచితంగా పంపిణీ చేశానని, 4 వేల మందికి గృహాలక్ష్మి పథకాన్ని వర్తింపజేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 5,600 మందికి రూ. 26 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ కింద చెక్కులను అందజేశామని,ఇటీవల రూ.53 కోట్లతో మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. అదేవిధంగా కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్ నూతన భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశామని, రూ.16 కోట్లతో చేపట్టిన నారాయణగూడ మోడల్ రైతుబజార్ మార్కెట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రూ. 85 లక్షలతో అంబర్‌పేటలో ముస్లింల శ్మశానవాటిక, బాగ్ అంబర్‌పేటలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత నాలుగున్నర ఏండ్లలోనే అంబర్‌పేట నియోజకవర్గంలోని 5 డివిజన్లకు చెందిన 4,819 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నేరుగా అందజేసి రికార్డు సృష్టించినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. అంబర్‌పేటలో ప్రజలు తనను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



బీజేపీ నాయకులను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు

### సంక్షేమ పథకాలకు ఆకర్శితులై చేరికలు..

సీఎం కేసీఆర్ పేదల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వేలాదిగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడలోని మోతిమార్కెట్‌కు చెందిన బీజేపీ నేత ఆర్.జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే వెంకటేశ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద,మధ్యతరగతి ప్రజల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, దాంతో ఆయన పరిపాలనకు జేజేలు పలుకుతున్నారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం విషయంలో సీఎం కేసీఆర్ రాజీపడే ప్రసక్తే లేదని, పార్టీ కోసం నిజాయితీగా కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గెల్వాయ్య, బి.కృష్ణాగౌడ్, డాక్టర్ శిరీషాయాదవ్, ఓంప్రకాశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, ప్రధాన కార్యదర్శి కె.సదానంద్,తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ లిస్ట్‌లో నో చాన్స్!

## • అంబర్‌పేటలో కాంగ్రెస్, బీజేపీ ఆశావాహుల్లో తప్పని ఎదురుచూపులు

## • ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ

అంబర్‌పేట, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావాహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఇప్పటికే ఖరారు చేయడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రచారంలో ముందుండగా, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు డీలా పడ్డాయి. కాగా ఆయా పార్టీల అధిష్టానం మొదటి లిస్ట్‌లో నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నెల రోజులు దాటుతున్నా అభ్యర్థి ఎవరనేది తేల్చలేదు. నామినేషన్లు సమర్పించేందుకు ఇంకా వారం రోజుల సమయమే ఉన్నా అభ్యర్థులను ప్రకటించకపోవడం సదరు నిరుత్సాహం కనబడుతున్నది.

### బీజేపీలో ఆశావహులు..

బీజేపీ విషయానికి వస్తే అంబర్‌పేట నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పోటీ చేస్తాడని జోరుగా వార్తలు వినబడుతున్నా...ఇటీవల ఆయన పోటీ నుంచి వెనక్కు తగ్గారని ఆ పార్టీలో నాయకులే చర్చించుకుంటున్నారు. పార్టీ అధిష్టానం కిషన్‌రెడ్డినే నిలబెట్టాలని చెబుతున్నా ఆయన ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తున్నది. మరి ఆయన స్థానంలో ఎవరిని నిలబెడతారనేది ఆసక్తిగా మారింది. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు కూడా పోటీలో ఉన్నారు. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గౌతంరావుకు టికెట్ ఇస్తే గెలిపించుకు వస్తానని కిషన్‌రెడ్డి అధిష్టానానికి సూచించినట్లు సమాచారం. గౌతంరావు కాకుంటే ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, అలాగే దివంగత టైగర్ నరేంద్ర కుమారుడు ఆలె జితేందర్ కూడా అంబర్‌పేట టికెట్ కోరుతున్నట్లు తెలుస్తున్నది. రెండు రోజుల క్రితం మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ కూడా తనకు టికెట్ ఇవ్వాల్సిందిగా కిషన్‌రెడ్డిని కోరినట్లు సమాచారం. మరీ వీరిలో టికెట్ ఎవరికి ఇస్తారో తెలియడం లేదు.

### కాంగ్రెస్ పార్టీ నుంచి..

ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే అంబర్‌పేట నియోజకవర్గంలో గత అసెంబ్లీ(2018) ఎన్నికల్లో బీఫామ్ ఇచ్చి వెనక్కు తీసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఈసారి టికెట్ ఇవ్వాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు పట్టుబడుతున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం అధ్యక్షుడిగా పని చేస్తున్న నూతి శ్రీకాంత్ గౌడ్ కూడా టికెట్ కోసం జోరుగా ప్రయత్నిస్తున్నారు. అతడికి టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సపోర్ట్ ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఇటీవల వి.హనుమంతరావు ప్రెస్‌మీట్ పెట్టి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అంబర్‌పేటలో ఏంపని? అని, లక్ష్మణ్‌యాదవ్‌కు టికెట్ రాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. తనను పార్టీలో నుంచి బయటకు పంపేందుకు కుట్ర జరుగుతుందని ఆయన వాపోయారు. మోతె రోహిత్ పేరు కూడా వినిపిస్తున్నది. వీరు కాకుండా ఇటీవల ఖైరాతాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రోహిత్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నది. వీరిలో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా ఎవరిని అభ్యర్థిగా ప్రకటించాలో ఇప్పటికీ తేల్చుకోలేకపోతున్నాయి.

### మొదటి జాబితాలో దొరకని టిక్కెట్...

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కొందరు అభ్యర్థులతో ఫస్ట్ లిస్ట్‌ను ప్రకటించాయి. కానీ అంబర్‌పేట నియోజకవర్గానికి ఎవరికీ చోటు దక్కలేదు. బీజేపీలో ఎవరిని బరిలో దించాలో వారికే అర్థం కావడం లేదు. కిషన్‌రెడ్డి మనసులో ఏమి ఉన్నది? బయటపడటంలేదు. ఇక కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారు తమ వ్యక్తికి టికెట్ అంటే.. తమ వ్యక్తికి టికెట్ అంటూ.. కొట్లాడుకుంటున్నారు.

### బీఆర్‌ఎస్ అభ్యర్థి దూకుడు..

బీఆర్‌ఎస్ అంబర్‌పేట అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌నే పార్టీ అధిష్టానం మళ్లీ ప్రకటించడంతో ఆయన తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బస్తీల్లో తిరుగుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాలేరు ధాటికి ప్రతిపక్షాలు తట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తున్నది.

# టీఆర్టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి

అంబర్‌పేట, అక్టోబర్ 25 : నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీహాల్ వద్ద పలువురు విలేకరులతో మాట్లాడారు. కాలనీ అసోసియేషన్‌కు 2015లో ఎన్నికలు జరిగాయని, వారి పదవీకాలం ముగిసి నాలుగు ఏండ్లు అవుతున్నా ఇంకా ఎన్నికలు నిర్వహించడంలేదని పేర్కొన్నారు. వెంటనే కొత్త కమిటీ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదవీ కాలం ముగిసినా అధ్యక్షుడినని చెప్పుకుంటున్న మహేశ్ ముదిరాజ్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ కమ్యూనిటీహాల్‌కు తాళం వేసి ఇతరులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కాలనీకి చెందిన వన్నాడి రమేశ్, జి.శ్రీనివాస్‌ముదిరాజ్, జి.విజయ్‌కుమార్, జాన్ విన్సెంట్, ఎస్.నర్సింగ్‌రావు, కాలనీ మైనార్టీ ప్రెసిడెంట్ అబ్బాస్, షబాబ్ ఫారుఖ్, రియాజ్, దీపక్, ఎంఏ మతిన్ కోరుతున్నారు.



ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్న టీఆర్టీ కాలనీ వాసులు

## శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే వెంకటేశ్



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– గోల్నాక, అక్టోబర్ 25

## హర్యానా గవర్నర్‌కు ఘన సన్మానం



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్, తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 25 : కులమతాలకు, రాజకీయలకతీతంగా అలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన అలయ్-బలయ్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని గవర్నర్ బండారు దత్తాత్రేయను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, క్షీర్‌సాగర్. సునిల్, సూరి, నర్సింగ్‌యాదవ్, భీమ్‌రాజ్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంక్షేమాన్ని అన్ని పార్టీలు మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

కాచిగూడ,అక్టోబర్ 25: తెలంగాణ అమరవీరుల సంక్షేమాన్ని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోల్లో చేర్చాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ అన్నారు. బుధవారం నింబోలిఅడ్డాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని పేర్కొన్నారు. అమరవీరుల సంక్షేమాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోల్లో చేర్చితే వారి కుటుంబాలు కొంతమేరకైనా బాగుపడుతాయని పేర్కొన్నారు. ఆయన వెంట పులిజాల కృష్ణ, భూషణ్‌భాస్కర్, ప్రదీప్‌గౌడ్, ప్రశాంత్ నిమ్‌కర్, తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, అక్టోబర్ 25: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 ఏండ్లున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం డబీర్‌పుర–మలక్‌పేట రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు నషం రంగు పూలచొక్కా, తెల్ల ప్యాంట్ ధరించి, 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ కోసం 9948695948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థులు గణితశాస్త్రంపై దృష్టి పెట్టాలి

కాచిగూడ, అక్టోబర్ 25: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి అభాకస్ పోటీలు దోహదపడుతాయని హిమాయత్‌నగర్ సిప్ అభాకస్ డైరెక్టర్ ఉత్తరాల సంధ్య అన్నారు. సిప్ అభాకస్ ఆధ్వర్యంలో అభాకస్ క్విజ్ పోటీలను బుధవారం స్థానిక మాడపాటి హనుమంతరావు హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో ఏడవ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఈ అభాకస్ పోటీలు దోహదపడుతాయని, తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు గణితశాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని పరిశోధనలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సునీత, యూవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.